క్లుప్తంగా

సిద్దోగానికి మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం



కేటీఆర్‌కు ఆహ్వానపత్రిక ఇస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో ఈనెల 31న జరిగే ఎల్లమ్మ సిద్దోగానికి రావాలని మంత్రి కేటీఆర్‌ను తంగళ్లపల్లి గౌడ నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. 29న పోచమ్మ బోనాలు, 30న ఎల్లమ్మ బోనాలు, 31న సిద్దోగం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బండి సత్తయ్య, కొండన్నపేట నాంపల్లి, సుద్దాల కర్ణాకర్, బత్తుల మల్లేశం, కందుకూరు రామాగౌడ్, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ భూములను కాపాడాలి’



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు శివారులో సర్వే నెంబర్ 405, 408లో దాదాపు 1800 ఎకరాల భూమి ఉందని, అందులో కొంత భూమి ప్రభుత్వ అవసరాలకు కొరకు పలు నిర్మాణాలు చేపట్టిందన్నారు. కానీ మిగిలిన భూమిని కొందరు బినామీ పేర్లతో కబ్జాకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ సమీపంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా 12 కిలోమీటర్ల దూరంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు గురవుతున్న భూములును అధికారులు సర్వే చేసి ఇల్లు లేని పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, సదానందం, మోర అజయ్, రాజశేఖర్, దేవదాస్ పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బోయినపల్లి: పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.10 వేల మద్దతు ధర చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ రెండు నెలలుగా జిన్నింగ్ మిల్ వ్యాపారులు సిండికేట్‌గా మారి పత్తి ధరను తగ్గిస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో రైతులకు ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారని తెలిపారు. కొంతమంది రైతులకు పెట్టుబడి సైతం చేతికి అందే పరిస్థితి లేదని ఆవేదన చెందారు. మండల సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్, రైతు సంఘం అధ్యక్షుడు రామంచ అశోక్, కడుకుంట్ల కొమురయ్య, స్వామి పాల్గొన్నారు.

మూలవాగే డంపింగ్ యార్డు..!

- పేరుకే తడిచెత్త.. పొడిచెత్త
- గ్రామ శివార్లలో డంపింగ్
- నిరుపయోగంగా కంపోస్టు షెడ్‌లు



నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్



జయవరం మూలవాగులో చెత్తను డంప్ చేస్తున్న ట్రాక్టర్

వేములవాడరూరల్: స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతో, వాటి కోసం లక్షల రూపాయల నిధులు కేటాయించినా క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదని తెలుస్తోంది. గ్రామాల్లో సేకరించిన తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా ట్రాక్టర్ల సహాయంతో కంపోస్టు షెడ్‌కు తరలించాలని ఉన్నా, చాలా గ్రామాల్లో అలాంటి నిబంధనలు పాటించడం లేదు. కొన్ని గ్రామాల్లో చెత్తను ఇప్పటికీ గ్రామ శివారు, వాగుల పక్కన పడేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ పరిసరాలు దుర్వాసన వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని జయవరం, బాలరాజుపల్లి, అచ్చన్నపల్లి గ్రామాలతో పాటు చాలా గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చిన చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డు ఎదురుగా ఉన్నా, అక్కడ వేయకుండా మూలవాగు, గ్రామ శివార్లలో డంప్ చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా అక్కడ డంప్ చేసిన చెత్తా చెదారానికి నిప్పు పెట్టడంతో పరిసరాలు పొగ, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నట్లు పరిసర కాలనీ ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామస్తులంటున్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

మండలంలోని 17 గ్రామాల్లో దాదాపు అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించారు. కాని వాటిని ఇప్పటికీ ఉపయోగించడం లేదు. గ్రామాల్లో సేకరించిన చెత్త చెదారాన్ని పరిసర ప్రాంతాల్లోనే ట్రాక్టర్ల ద్వారా వదిలిపెడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పేరుకు మాత్రం డంపింగ్ యార్డులుగా మిగిలిపోతున్నాయి. సంబంధిత మండల స్థాయి అధికారులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో, ఆయా పరిసరాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

వృథాగా ప్రభుత్వ నిధులు



గ్రామాల్లో నిర్మించిన పలు అభివృద్ధి పనులు నిరుపయోగంగానే మిగిలిపోతున్నాయి. చాలా గ్రామాల్లో లక్షల రూపాయలతో నిర్మించిన డంపింగ్ యార్డులే కాకుండా శ్మశానవాటికలు, పల్లె ప్రకృతి, క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగానే ఉన్నాయి.

– చెట్టిపల్లి రవికిశోర్, నాగాయపల్లి

బయటనే పడేస్తున్నారు



మా గ్రామంలో నిర్మించిన డంపింగ్ యార్డు, శ్మశానవాటికలు ఇప్పటి వరకు ఉపయోగంలో లేవు. అక్కడికి పోవడానికి చెక్‌డ్యాం నిర్మాణం అడ్డుగా ఉండడంతో కనీసం రహదారి లేదు. గ్రామ చెత్తంతా వాగు పక్కనే పడేసి తగులబెడుతున్నారు. నిర్మాణాలు వృథాగానే ఉన్నాయి.

– ఇట్టిరెడ్డి రణధీర్‌రెడ్డి, బొల్లారం

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం



వేములవాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతిని ప్రజలు వినియోగించుకుంటున్నారు. అలాగే శ్మశానవాటికలు దాదాపు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– రాంరెడ్డి, ఎంపీడీవో, వేములవాడరూరల్

నియామకం

కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుల నియామకం

బోయినపల్లి: మండలంలోని 23 గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులను నియమించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గ్రామ శాఖ అధ్యక్షుల నియామకం చేపట్టినట్లు తెలిపారు.

భారత్ జోడో క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: భారత్ జోడో యాత్ర క్యాలెండర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని) ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. వచ్చే నెల 6 నుంచి ప్రారంభమయ్యే హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, పట్టణ అధ్యక్షుడు నేరెళ్ల నర్సింగంగౌడ్, మాజీ సర్పంచ్ ఆసాని సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన ప్రదర్శన

రాజ్యాంగాన్ని పరిరక్షించాలని అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం



వేములవాడలో నిరసన ప్రదర్శనలో నాయకులు



తంగళ్లపల్లి: విగ్రహానికి వినతిపత్రమిస్తున్న నాయకులు



చందుర్తిలో..

వేములవాడ/తంగళ్లపల్లి/చందుర్తి/ముస్తాబాద్/వీర్నపల్లి/చందుర్తి: రాష్ట్ర గవర్నర్‌కు గౌరవాన్ని ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్ తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద బీజేపీ నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కరోనా సాకుతో పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించకుండా రాజ్యాంగాన్ని అంబేడ్కరును అవమానించారని ఆరోపించారు. నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేలా ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చూడాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షులు రేగుల సంతోష్‌బాబు, సురువు వెంకట్, కోలా ఆంజనేయులు, కస్తూరి కార్తీక్‌రెడ్డి, గునుగుల దేవేందర్ రెడ్డి, పోంచెట్టి రాకేశ్, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మూలమలుపులు.. బావులు



వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రి గ్రామం నుంచి పట్టణాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటితో పాటు రోడ్డు పక్కనే బావులు ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రోడ్డు పక్కన ఉన్న బావులను పూడ్చి వేయాలని అధికారులు నెత్తినోరు మొత్తుకున్నా బావుల యజమానులు ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికీ ఇంకా చాలా గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కన బావులు నోళ్లు తెరుచుకొని ఉన్నాయి. కనీసం రోడ్డు పక్కన హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలు న్నాయి. అధికారులు స్పందించి బావులను పూడ్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాల ఉత్పత్తిదారులకు బహుమతులు అందజేత



బహుమతులు అందిస్తున్న చైర్మన్, సూపర్‌వైజర్

కోనరావుపేట: పాలు అధికంగా ఉత్పత్తి చేసిన రైతులకు డెయిరీ చైర్మన్ జిల్లెల్ల లక్ష్మారెడ్డి, రూట్ సూపర్‌వైజర్ అనంతరెడ్డి బహుమతులు అందజేశారు. మండలంలోని కనగర్తి పాల ఉత్పత్తిదారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. 2022లో అత్యధిక లీటర్లు పాలు పోసిన మారుపాక రాజయ్య(ప్రథమ), పోగుల మల్లయ్య (ద్వితీయ), రావులపెల్లి మహిపాల్‌రెడ్డి(తృతీయ) బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గోపాల్, ఎల్లె ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి అండెం రాజిరెడ్డి, టెస్టర్ మోతె చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణాలు

- బస్టాండ్ ఓ చోట.. బస్సులు ఆగేది మరోచోట
- గ్రామాల్లో పనికిరాని బస్టాండ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కోనరావుపేట: పై ఫొటో చూసేందుకు అందంగా కనిపిస్తున్న కోనరావుపేట బస్టాండ్‌ది. కానీ ఒక్క బస్సు కూడా ఇక్కడ ఆగదు. అందుకే ఒక్క ప్రయాణికుడు కనబడరు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా కోనరావుపేటలోని బస్‌స్టేషన్ నిరుపయోగంగా మారుతోంది. ఆర్టీసీ డ్రైవర్లు బస్‌స్టేషన్‌లో బస్సులు ఆపక ముందుకెళ్లి హోటళ్ల ముందు ఆపుతుండడంతో ప్రయాణికులు బస్టాండులోకి వెళ్లడం లేదు. దీంతో కొన్నేళ్లుగా బస్టాండ్ ఎందుకు పనికిరాకుండా మారింది.

కోనరావుపేట మండల కేంద్రంలో రూ.2 లక్షలతో నిర్మించిన బస్‌స్టేషన్‌ను 2002లో అప్పటి సర్పంచ్ బొమ్మ విజయ నిర్మించగా సెప్టెంబర్ 24న అప్పటి కేంద్ర మంత్రి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ప్రారంభించారు. బస్‌స్టేషన్ ప్రారంభించిన కొన్ని నెలల వరకు బస్సులు అక్కడే నిలపడంతో ప్రయాణికులతో కళకళలాడేది. రాను రాను బస్టాండ్‌లో బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు కూడా తగ్గిపోయారు.

సామగ్రి దొంగలపాలు

బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన టెలివిజన్, ఫ్యాన్ ఏర్పాటు చేయగా, కొద్ది రోజుల వ్యవధిలోనే ఫ్యాన్, ఇతర విద్యుత్ పరికరాలు గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు.

మిగతా బస్టాండ్‌ల పరిస్థితీ అదే..

మండలం కొలనూర్‌లోని ప్రయాణ ప్రాంగణం శిథిలావస్థకు చేరుకుంది. 1995లో అప్పటి జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, ఎంపీపీ అబ్బసాని శంకర్‌గౌడ్ హయాంలో నిర్మించగా ప్రస్తుతం పగుళ్లు ఏర్పడుతోంది. బస్టాండ్‌కు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అది శిథిలావస్థ చేరుకుంది. మండలంలోని మర్తనపేట, ధర్మారం, నిజామాబాద్, మామిడిపల్లి, బావుసాయిపేట, నాగారం గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. మరిమడ్ల, కనగర్తి, వట్టిమల్ల, అజ్మీరాతండా, రెడ్డితండా, తదితర గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలే లేవు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రానున్నది ఎండాకాలం కాబట్టి మరిన్ని ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ప్రయాణ ప్రాంగణానికి మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

సమన్వయ లోపం.. లబ్ధిదారులకు శాపం

- చెక్కుల కోసం ఎదురుచూస్తున్న కల్యాణలక్ష్మి లబ్ధిదారులు
- మంజూరైన పంపిణీ చేయని వైనం
- ప్రజాప్రతినిధుల తీరుతో ఇబ్బంది

తంగళ్లపల్లి: మండలంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులు చెక్కుల కోసం ఎదురుచూస్తున్నారు. సరైన సమయానికి చెక్కులు అందించేందుకు ప్రభుత్వం త్వరగా స్పందిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు పట్టింపులకు పోవడం, సమన్వయ లోపంతో పంపిణీలో జాప్యం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

14 గ్రామాలకు 68 చెక్కులు

మండలంలోని 14 గ్రామాలకు ఇటీవల 68 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున రూ.60,07,888 విడుదల చేసింది. ఇప్పటికే ఆ మొత్తం 68 చెక్కులు రెవెన్యూ అధికారుల వద్దకు చేరాయి. బద్దెనపల్లి-1, బస్వాపూర్-3, చీర్లవంచ-6, గండిలచ్చపేట-1, జిల్లెల-7, కస్బేకట్కూర్-2, మండెపల్లి-7, నర్సింహులపల్లె-1, నేరెళ్ల-10, ఓబులాపూర్-7, రామచంద్రాపూర్-1, సారంపల్లి-1, తాడూర్-10, తంగళ్లపల్లి-10, వేణుగోపాలపూర్-1 చొప్పున మొత్తం 68 చెక్కులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి..



తంగళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయం

సమన్వయలోపం

కల్యాణలక్ష్మి చెక్కులు రెవెన్యూ అధికారులకు చేరి వారం రోజులు గడుస్తున్నా పంపిణీ చేయడానికి మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. తంగళ్లపల్లికి చెందిన ఇద్దరు మండల స్థాయి మహిళా ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య లేకపోవడంతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి చెక్కుల పంపిణీని వాయిదా వేస్తూ వస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. లబ్ధిదారులు మాత్రం పక్క మండలాల్లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చూసి తమకెప్పుడిస్తారో అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇరువురు ప్రజాప్రతినిధులు మధ్యన ఉన్న పంతాన్ని వీడి ప్రజల క్షేమం కోసం పనిచేయాలని కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే పంపిణీ చేయాలి



ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో అలసత్వం వహించడం సరికాదు. నిరుపేదలకు మేలు చేసేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటాయి. చెక్కులు మంజూరైనప్పటికీ పంపిణీ చేయకపోవడం సరికాదు. వెంటనే పంపిణీ చేయాలి.

– భైరినేని రాము, ఎంపీటీసీ చిన్నలింగాపూర్

ప్రతీ ఇంటికి వెళ్లి ఇస్తాం



కల్యాణలక్ష్మి పథకం చెక్కులు కార్యాలయంలోనే ఉన్నాయి. చెక్కుల పంపిణీ కొరకు కసరత్తు ప్రారంభించాం. త్వరలోనే ప్రజాప్రతినిధుల సమక్షంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తాం. మాపైన ఎవరి ఒత్తిడి లేదు.

– పి.సదానందం, తహసీల్దార్ తంగళ్లపల్లి

బీరువాలు అందజేత

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ధనలక్ష్మి, వరలక్ష్మి, ధరణి, సాయిజ్యోతి మహిళా సంఘాలకు స్థానిక ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్ బీరువాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షులు రేణుక, పద్మ, భారతి, రేష్మా, సీఏలు బాలలక్ష్మి, రాణి, లావణ్య, వినోద పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలు

ముస్తాబాద్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి మోదీ పరీక్షా పే చర్చాలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలంటే భయం లేకుండా ప్రతిభను చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి సూచించారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లి, ఇల్లంతకుంట గ్రామాల్లోని నర్సరీలను ఏపీవో చంద్రయ్య శుక్రవారం పరిశీలించారు. నర్సరీలలో మొలకెత్తుతున్న మొక్కలను కాపాడేందుకు షేడ్‌నెట్లు ఏర్పాటు చేసి రోజుకు రెండు సార్లు నీరు పట్టాలని సూచించారు.